నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 5 ఫిబ్రవరి 2024 | NALGONDA


## కూరెళ్లకు రాష్ట్ర ప్రభుత్వ సత్కారం



రామన్నపేట : పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కూరెళ్లను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

రామన్నపేట, ఫిబ్రవరి4 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, మధుర కవి కూరెళ్ల విఠలాచార్య పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదికలో ఘనంగా సత్కరించింది. తెలంగాణ భాష, సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



# యాసంగి సాగు 4 లక్షల ఎకరాలే!

- నల్లగొండ జిల్లాలో 1.8 లక్షల ఎకరాలు తగ్గిన సాగు విస్తీర్ణం
- ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, వర్షాభావ పరిస్థితులే కారణం
- బావులు, బోర్లలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పంటలు చేతికొచ్చే దాకా రైతుల పరిస్థితి బిక్కుబిక్కే

నల్లగొండ, ఫిబ్రవరి 4 : జనవరి–31తో యాసంగి సాగు ప్రణాళిక ముగిసింది. ఈ ఏడాది యాసంగిలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 5.81లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా 4.01లక్షల ఎకరాల్లోనే (83శాతం) సాగు అయ్యింది. ఇందులో అత్యధికంగా వరి 3,79,696 ఎకరాలు, వేరుశనగ 17,715, జొన్న 1,069, పెసర 1,684, మొక్క జొన్న, ఆముదం, మినుము, బొబ్బర 1,100 ఎకరాల్లో సాగవుతున్నాయి. గడిచిన తొమ్మిదేండ్లుగా సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగగా ఈ సారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ శాఖ అంచనాలు తప్పాయి.

నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీరు లేనందున ఎడమ కాల్వతో పాటు ఏఎంఆర్పీ కెనాల్ కింద ఉన్న ఆయకట్టు సాగులోకి రాలేదు. వీటి కిందనే మెజారిటీ సాగు భూములు ఉండగా అక్కడక్కడ బోర్లు ఉన్న రైతులతో పాటు నాన్ ఆయకట్టు రైతులు సాగు చేయటంతో ఆ మాత్రం పంటల సాగు అవుతున్నది. ప్రస్తుతం బోర్లలో రోజురోజుకూ నీటి లభ్యత తుగ్గుతుండటంతో పొట్ట దశలో నీరు ఏ మేరకు సరిపోతుందోనని రైతులు ఆందోళనలో చెందుతున్నారు.

### బోర్లే ఆధారం

జిల్లాలో వానకాలంతోపాటు యాసంగి సీజన్‌లోనూ వరి పైరునే ఎక్కువగా సాగు చేస్తారు. ఇక్కడ నాగార్జున సాగర్‌తోపాటు ఆ ప్రాజెక్టులో అంతర్భాగమైన ఏఎంఆర్పీ కింద ఎక్కువగా వరి వేస్తారు. సాగర్‌లో ఎడమకాల్వ కింద 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రాజెక్టులోనీరు లేనందున ఈ సారి బోరు బావులను నమ్ముకొని 30వేల ఎకరాలకు మించి సాగు చేయలేదు. 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఏఎంఆర్పీ హైలెవల్, లోలెవల్ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు లేవని, నీటి విడుదల చేయలేమని అధికారులు ప్రకటించడంతో సగం మేర మాత్రమే సాగు చేశారు. ఈ ప్రాజెక్టు పరిధిలో ఎక్కువగా బోర్ల ద్వారానే పంటలు పండిస్తున్నారు. పంటల చివరి వరకు నీరు సరిపోతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక మూసీ ప్రాజెక్టు కింద 30వేల ఎకరాల్లో వరి సాగు అవుతున్నది.

### 14 మండలాల్లో లోటు వర్షపాతం

జిల్లాలో గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సరిపడా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. దాంతో బోర్లు, బావుల్లో నీటి మట్టం తగ్గుతున్నది. జిల్లాలో 14 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మరో రెండు నెలలు పోతే ఆయా మండలాల్లో నీటి నిల్వలు బాగా తగ్గే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### గతం కంటే చాలా తక్కువ


ఈ సారి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేనందున బోరు బావులపై ఆధార పడ్డ రైతులు మాత్రమే పంటల సాగు చేశారు. ప్రధానంగా వరి సాగే 3.79 లక్షల ఎకరాల్లో ఉన్నది. మరో 22వేల ఎకరాల్లో ఇతర పంటలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ అంచనాకు చాలా తక్కువ సాగు చేశారు.

–శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

## కృష్ణా జలాల పంపిణీ కేఆర్‌ఎంబీకి అప్పగించడం ప్రభుత్వ దివాలా కోరుతనం

- ఎడమ కాల్వ రైతాంగం ఉద్యమానికి సిద్ధం కావాలె
- బీఆర్‌ఎస్ హయాంలో వరుసగా 18 పంటలకు సాగర్ జలాలు
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లక్ష చెప్పలతో ధీటైన సమాధానం
- కృష్ణాజలాల పంపిణీపై మంత్రి ఉత్తమ్ సమాధానం చెప్పాలి
- దొంగలే లంకెల బిందెల కోసం వెతుకుతారు...
- ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లం... కార్యకర్తలకు అండగా ఉంటాం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ సమావేశం



కోదాడ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, వేదికపై ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు

కోదాడ, ఫిబ్రవరి 4 : ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సాగర్ ఎడమ కాల్వ నుంచి వరుసగా 18 పంటలకు సాగునీరు అందించారు. ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీలో నీరు ఉన్నా పంటలు ఎండిపోకుండా కాపాడారు. కృష్ణా జలాలలో మన వాటా ఏపీకి చుక్క నీరు కూడా వదల లేదు. కేసీఆర్ కేంద్ర మెడలు వంచి కృష్ణా జలాలలో వాటాను రప్పిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల పంపిణీని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించి అన్నదాతలను మోసం చేస్తున్నది' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కోదాడలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కృష్ణా జలాల ట్రిబ్యునల్ వివాదం ప్రధాని మోదీ తీర్చడానికి తొమ్మిదేండ్లకు పైగా పట్టిందన్నారు. నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి కృష్ణా జలాల వాటాను ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు చూసుకుంటాయని, కేంద్రం తలదూర్చవద్దని కరాఖండిగా చెప్పారని పేర్కొన్నారు. ఎడమ కాల్వ రైతులకు అన్యాయం చేసి, పంటలను ఎండబెడుతున్న కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా నాడు ఉద్యమ నేతగా కేసీఆర్ కోదాడ నుంచే హాలియా వరకు పాదయాత్ర నిర్వహిస్తే తలొగ్గిన అప్పటి ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని గుర్తుచేశారు. గత పదేండ్లలో సాగు, తాగు నీటితోపాటు 24 గంటల విద్యుత్‌ను అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రెండు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ చేతకాని తనం బట్టబయలు అయిందని విమర్శించారు. ఎందుకు ఓటు వేశామా అని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. ఎడమ కాల్వ రైతుల బతుకులను ప్రశ్నార్థకం చేస్తున్న కేఆర్‌ఎంబీని నిరసిస్తూ రైతాంగం ఉద్యమించాల్సిన పరిస్థితులు ఆసన్నమయ్యాయని, అందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు అని, నిర్వీర్యంగా సాగుతున్న కాంగ్రెస్ పాలనను అర్థం చేసుకుంటున్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించటం ఖాయమని స్పష్టం చేశారు.

### ఓట్లడిగితే చెప్పతో సమాధానం చెప్పాలి

రైతుబంధు డబ్బులు అందలేదని ప్రశ్నిస్తే చెప్పుతో కొట్టాలని మంత్రులు సైతం నానా దుర్భాషలాడుతున్నారని, కాంగ్రెస్‌ను గెలిపించిన చెప్పులతో కొట్టించుకోవటానికా అని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో వారు ఓట్లు అడిగితే లక్ష చెప్పులతో సమాధానం ఇవ్వాలని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు లంకెల బిందెలు లేవనడం వారి చేతకాని పాలనకు నిదర్శనమని, దొంగలే లంకెల బిందెల కోసం వెతుకుతారని ఎద్దేవా చేశారు. వైఎస్, చంద్రబాబుల కుట్రలను ఛేదించి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌ది అని, ఆయనపై అవాకులు, చవాకులు పేలితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చేతనైతే ఆరు గ్యారెంటీలతో పాటు 414 హామీలు నెరవేర్చాలని సవాలు విసిరారు. ఎంతకాలం బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించి కాలం వెల్లబుచ్చుతారని విమర్శించారు. కృష్ణా జలాల పంపిణీని కేఆర్‌ఎంబీకి అప్పగించటంపై జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ గెలుపోటములు సహజమేనని పార్టీ పునఃనిర్మాణానికి దృష్టి సారించాలని శ్రేణులకు సూచించారు. ఉద్యమనేత కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోని నంబర్‌వన్‌గా నిలిపారని కొనియాడారు. కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ అమలు కాని వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేశారని, ఇప్పటికే ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఓటమిపై కూలంకరషంగా చర్చించి భవిష్యతులో పార్టీ నిర్మాణం పై దృష్టి సారిద్దామని తెలిపారు. అధికార మత్తుతో తమ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేంది లేదన్నారు. ఈ సమావేశంలో నడిగూడెం ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు, నాయకులు సత్యబాబు, సుంకరి అజయ్‌కుమార్, తొగరు రమేశ్, పచ్చిపాల వేణు యాదవ్, నాగరాజు, వెంపటి మధు, మామిడి రామారావు, బెజవాడ శ్రావణ్, షఫీ, శీలం సైదులు, లింగారెడ్డి, ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ బాధ్యులు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, పక్కన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తిప్పన విజయసింహారెడ్డి

## పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

- నేడు బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం
- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 4 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీదే గెలుపని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మిర్యాలగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారాన్ని కోల్పోయినప్పటికీ పార్టీ బలంగా ఉందని, కార్యకర్తలు అధైర్యపడవద్దని సూచించారు. నేడు పట్టణంలోని టీఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే నియోజకవర్గస్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొననున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు అన్నభీమోజు నాగార్జునాచారి, పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, నాయకులు మగ్దుంపాషా, బాసాని గిరి, బంటు శ్రీనివాస్, మదార్‌బాబా, ఖాజామొయినొద్దీన్, ఎండీ షోయబ్ పాల్గొన్నారు.

# ఆత్మహత్యలపై అనుమానాలెన్నో..?

- అంతుబట్టని పదో తరగతి విద్యార్థుల ఘటన
- స్కూల్‌లో బాలికలతో గొడవే కారణమా..?
- వార్డెన్, వాచ్‌మన్, ఆటో డ్రైవర్‌పై పేరెంట్స్ అభియోగాలు
- సూసైడ్ నోట్‌పైనా పలు సందేహాలు
- ముమ్మరంగా కొనసాగుతున్న దర్యాప్తు



భువనగిరి ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థినుల కుటుంబ సభ్యులు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన పదో తరగతి విద్యార్థినుల ఘటనపై ఎన్నో అనుమానాలు తావిస్తున్నాయి. అసలు ఆత్మహత్యా..? హత్యా..? అనేది క్లారిటీ రావడం లేదు. బాలికలది ఆత్మహత్య అని అధికారులు, పోలీసులు చెబుతుండగా, కచ్చితంగా హత్యే అని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. ఇందుకు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### పిల్లల మధ్య గొడవే కారణమా..?

విద్యార్థినుల సూసైడ్‌కు విద్యార్థుల మధ్య గొడవే కారణమని వార్డెన్ శైలజ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఏడో తరగతి, పదో తరగతికి చెందిన కొందరు విద్యార్థుల మధ్య గొడవ జరిగినట్లు పేర్కొన్నారు. ఘర్షణ నేపథ్యంలో టీచర్.. వార్డెన్‌కు సమాచారం ఇవ్వగా, ఆమె సదరు విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే చిన్నపాటి గొడవకే ఆత్మహత్య చేసుకునేందుకు పిరికోళ్లు తమ పిల్లలు కాదని తల్లిదండ్రులు అంటున్నారు. తమ కూతురు అన్ని విషయాల్లో ధైర్యం ఉంటుందని, సూసైడ్ చేసుకోవడం ఏంటని భవ్య తల్లి చెప్పుకొచ్చింది. కాగా అసలు గొడవ ఎందుకు జరిగిందనే ఇప్పటికీ క్లారిటీ రాలేదు.

### ఆటో డ్రైవర్‌పై అభియోగాలు..!

ఈ ఘటనలో మరో కొత్త కోణంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాస్టల్ పని చేస్తున్న ఓ ఉద్యోగి, ఆటో డ్రైవర్ మధ్య కొంత కాలంగా అక్రమ సంబంధం ఉందనే ప్రచారం జరుగుతున్నది. సదరు ఆటో డ్రైవర్ పగలు, రాత్రి అనే తేడా లేకుండా హాస్టల్‌లో తిరిగేవారని చెబుతున్నారు. స్థానికులు సైతం అతడిపై చెడుగా చెబుతుండటం గమనార్హం. ఈ కోణంలోనూ విద్యార్థినులను ఏమైనా చేసి ఉండవచ్చా అనే విషయంలోనూ స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. తల్లిదండ్రులు సైతం వార్డెన్, సదరు ఉద్యోగి, ఆటో డ్రైవర్‌పైనే అనుమానాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల ఆటో డ్రైవర్ విషయంలో గొడవ జరిగితే భవ్య తమకు ఫోన్ చేసి చెప్పిందని, ఇక్కడ ఉండలేనని తీసుకెళ్లాలని కోరిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. రెండు నెలల్లో పరీక్షలు ఉన్నాయని, పూర్తికాగానే తీసుకెళ్తామని బదులిచ్చామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆటో డ్రైవర్, సదరు ఉద్యోగి పరారీలో ఉన్నారు.

### సూసైడ్ నోట్ నిజమేనా..?

విద్యార్థుల ఆత్మహత్య తర్వాత శనివారం రాత్రి ఓ సూసైడ్ నోట్ బయటకు వచ్చింది. ఇద్దరు విద్యార్థుల్లో ఇది ఎవరు రాశారనే క్లారిటీ రావాల్సి ఉంది. నోట్‌లో పూర్తిగా వార్డెన్ శైలజకు అనుకూలంగానే ఉందనే ప్రచారం జరుగుతున్నది. తల్లిదండ్రుల గురించి ఎక్కడా ప్రస్తావించ లేదు. అయితే భవ్య, వైష్ణవి సంతకాలు ఒకే విధంగా ఉన్నాయి. మరోవైపు హ్యాండ్ రైటింగ్ తమ పిల్లలది కాదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. సూసైడ్ నోట్‌పై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తే అసలు విషయం ఏంటనేది బయటకు వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థినుల మృత దేహాలను పోస్ట్ మార్టం రూమ్‌లో భద్రపరించారు. పోస్ట్ మార్టం కంటే ముందు స్టూడెంట్లను చూసేందుకు పలువురు కుటుంబ సభ్యులను అనుమతించారు. బయటకు వచ్చిన వారు పలు సందేహాలను వ్యక్తం చేశారు. ఓ విద్యార్థి చేతిపై గాయాలు ఉన్నాయని, మెడపై చుట్టు గాట్లు ఉండకుండా ఒక వైపే ఉన్నాయని చెప్పుకొచ్చారు. నాలుక బయటకు రాలేదని అంటున్నారు.

### ముమ్మరంగా దర్యాప్తు..

విద్యార్థుల ఘటనపై పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నా రు. ఆదివారం ఉదయమే సూసైడ్ స్పాట్ అ యిన సాయికృప డిగ్రీ కాలేజీలోని ఎస్సీ హాస్టల్‌లో విచారణ ప్రారంభించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాలతో కలిసి ఘట నా స్థలిని పరిశీలించారు. అక్కడే పలు వివరాలను సేకరించారు. అనంతరం క్లూస్ టీం హాస్టల్‌ను సందర్శించి వివరాలు సేకరించింది.

# టెన్త్ విద్యార్థినుల సూసైడ్‌పై అట్టుడికిన భువనగిరి

- ఉదయం నుంచే పేరెంట్స్, కుటుంబ సభ్యుల ధర్నా
- మద్దతు తెలిపిన విద్యార్థి, మహిళా, ప్రజా సంఘాలు, బీఆర్‌ఎస్
- ఘర్షణలో పలువురు మహిళలకు గాయాలు
- పోస్ట్‌మార్టం పూర్తి.. స్వస్థలాలకు మృతదేహాల తరలింపు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : ఆర్తనాదాలు.. ఆగ్రహాలు.. ఆందోళనలు.. తోపులాటలు.. ఉద్రిక్త పరిస్థితులతో భువనగిరి అట్టుడికింది. పదో తరగతి విద్యార్థినుల ఆత్మహత్యలతో పట్టణం ఆగ్రహించింది. బాలికల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, విద్యార్థి, మహిళా, ప్రజాసంఘాలు, బీఆర్‌ఎస్ నేతల ఆందోళనలతో దద్దరిల్లింది. బాలికల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

### ఉదయం ఎస్సీ హాస్టల్ ఎదుట ఆందోళనలు..

ఆత్మహత్యల ఘటన నేపథ్యంలో ఉదయం నుంచే ఆందోళనలు షురూ అయ్యాయి. పట్టణంలోని సాయికృప డిగ్రీ కాలేజీలో నడుస్తున్న ఎస్సీ హాస్టల్ ఎదుట భవ్య, వైష్ణవి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. గేటు ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. ఎస్సీ హాస్టల్ ఎదుట ఆందోళన చేసినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంతో అందరూ భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలివచ్చారు. అక్కడే ప్రధాన రహదారిపై అందరూ బైఠాయించారు. రెండు వైపులా వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకానొక సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### బీఆర్‌ఎస్ నేతల అరెస్ట్.. పోలీస్ స్టేషన్లకు తరలింపు

ఆందోళన చేస్తున్న సమయంలోనే పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు. విద్యార్థినుల కుటుంబసభ్యులతోపాటు బీఆర్‌ఎస్‌కు చెందిన పట్టణ శాఖ నాయకులు, ప్రజా సంఘాలనేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు. ఈ క్రమంలో పోలీస్ట్ స్టేషన్‌లో తమను రక్తాలు వచ్చేలా కొట్టారని విద్యార్థినులు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

### దుఖఃసాగరంలో కుటుంబ సభ్యులు

ఇద్దరు విద్యార్థినుల విషాద ఘటనతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఖఃసాగరంలో నిండిపోయారు. ఎస్సీ హాస్టల్ వద్ద, ఏరియా ఆస్పత్రి ముందు వారి రోదనలు మిన్నంటాయి. మరోవైపు వైష్ణవి తల్లి లేదు. చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి దివ్యాంగుడు. తన తమ్ముడు సైతం ఆరేండ్ల క్రితమే చనిపోయాడు. ఒక్కగానొక్క కూతురు కూడా చనిపోవడంతో ఆ తండ్రికి కండ్లలో ఏడ్వడానికి నీళ్లు కూడా రావడంలేదు.

### హాస్టల్ ఖాళీ..

విద్యార్థినుల ఘటనతో సాయికృప డిగ్రీ కాలేజీలో ఉంటున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఒక్కొక్కరుగా ఇంటికి వెళ్లిపోయారు. తోటి విద్యార్థులు చనిపోవడంతో వారంతా భయాందోళనకు గురయ్యాయి. అక్కడ ఉండాలంటే జంకుతున్నారు. విద్యార్థులంతా తమ సామాన్లను తీసుకొని పయనమయ్యారు. దీంతో హాస్టల్ ఖాళీ అయ్యింది.

### ఆటో డ్రైవర్ ఆంజనేయులే కారణం

'వారం రోజుల క్రితం భవ్య ఇంటికి వచ్చింది. అమ్మ నాకు హాస్టల్ పోబుద్ధి అయితలేదంది. చిట్టి నువ్వు స్కూల్ టాపర్ కావాలి బిడ్డా.. నిన్ను అందరూ గొప్పగా చూడాలని హాస్టల్ పంపుతున్నమని చెప్పిన.. ఆటో డ్రైవర్ రాత్రి 12:30కి వచ్చి పోయేటప్పుడు మెట్ల మీద ఉన్న పిల్లలను చూసుకుంటా పోతాడని చెప్పింది. అమ్మాయిలను మీద కూర్చోబెట్టుకుంటాడని అన్నది. నేను మేడానికి రెండు సార్లు కంప్లెంట్ చేశానని, నీకెందుకు అని వార్డన్ అన్నదని చెప్పింది. నా బిడ్డ చావుకు కారణం ఆటో డ్రైవర్ ఆంజనేయులు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.


– కోడి లలిత, విద్యార్థిని భవ్య తల్లి

## విద్యార్థుల మేధా శక్తి పెంపొందించేందుకు చెస్ దోహదం

- సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 4 : విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించేందుకు చెస్ దోహదపడుతుందని సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్ (అండర్ 9, 11, 13, 15)బాల బాలికల పోటీల్లో విజేతలైన వారికి ఆయన మెడల్స్ మాట్లాడారు. చెస్‌లో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడానికే ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఈ పోటీలకు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.సతీశ్‌కుమార్, ఆర్బిటర్స్ వీరప్రసాద్, రవి, జానయ్య, చెస్ అసోసియేషన్ సభ్యులు కరుణాకర్, ఎం.సాయికుమార్, లింగారెడ్డి, మురళి, కవిత పాల్గొన్నారు.

విజేతలు వీరే : అండర్15 బాలికల విభాగంలో ప్రథమ కె.చిద్విలాసిని, ద్వితీయ వి.వర్షిణి, తృతీయ పి.మేఘన, బాలుర విభాగంలో ప్రథమ ఎస్.ప్రశాంత్, ద్వితీయ బి.హర్షిత్, తృతీయ ఎస్.కె.ఫర్హాన్, అండర్ 13 బాలురలో ప్రథమ ఎస్.వివేక్, ద్వితీయ ఆకాశ్‌వరుణ్, తృతీయ ఇ.అఖిలేశ్, అండర్ 9 బాలుర విభాగంలో ప్రథమ బి.శ్రీవాత్సవ్, ద్వితీయ బి.దీక్షిత్ సింగ్‌నాయక్, తృతీయ బి.నిహాల్ చందన్ విజేతలుగా నిలిచారు.



చెస్ విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కృపాకర్